క్లుప్తంగా...

ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

రాంగోపాల్‌పేట్: పీజీ రోడ్డులోని ఓ హోటల్ యజమాని ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన వంటశాలలతో ఇబ్బందులకు గురవుతున్నామని కోకిల అపార్ట్‌మెంట్ వాసులు సునీల్ రాజ్‌పాల్, అశోక్ రాజ్‌పాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఫుట్‌పాత్ మీద వంటశాల ఏర్పాటు చేయడంతో దట్టమైన పొగ అర్ధరాత్రి వరకు అపార్ట్‌మెంట్ ఫ్లాట్లలోకి వస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయని వాపోయారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉచితంగా టెట్ నమూనా పరీక్ష

సికింద్రాబాద్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ అర్హత నమూనా పరీక్షను పరీక్ష (టెట్) రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నట్టు సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బి.తిరుపతిరెడ్డి తెలిపారు. టెట్ వన్, టూ గ్రాంగ్ టెస్టును ఆన్‌లైన్ పద్ధతిలో ఈ నెల 7వ తేదీ ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతిరెడ్డి కోరారు. మరింతా సమాచారం కోసం 9989913935 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సొంతింటి కల సాకారం

లాలాపేట: సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న డబుల్ బెడ్‌రూమ్ పథకం ద్వారా పేద ప్రజల సొంతింటి కల సాకారం అయ్యిందని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. ఇటీవల మొదటి విడత లక్కీ డ్రా ద్వారా తార్నాక డివిజన్ నుంచి ఇళ్లు దక్కించుకున్న పలువురు లబ్ధిదారులు సోమవారం తార్నాలో డిప్యూటీ మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కార్పొరేటర్ ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న సుచిత్ర శ్రీకాంత్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర ప్రత్యేక పూజలు చేశారు. నా మట్టి నాదేశం ఆజాదీకా అమృతోత్సవ్ కార్యక్రమంలో భాగంగా పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఆకుల ప్రతాప్, కేతినేని శ్రీధర్, సాయి ముదిరాజ్, ఉషారాణి, జయ పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు



దరఖాస్తు సమర్పిస్తున్న రవిప్రసాద్‌గౌడ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు బీజేపీ టికెట్ కోసం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్ సోమవారం దరఖాస్తుల స్వీకరణ కమిటీ సభ్యులు రాష్ట్ర కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు సుభాష్‌చంద్ర, దాసరి మల్లేశంకు దరఖాస్తులు అందజేశారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం అంకితభావంతో పని చేస్తున్న తనకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరామన్నారు.

తప్పిపోయిన బాలుడిని చేరదీసిన పోలీసులు



సికింద్రాబాద్: ఇంటినుంచి తప్పిపోయిన బాలుడిని చేరదీసిన వారాసిగూడ పోలీసులు నాలుగు గంటల్లో కుటుంబ సభ్యులకు అప్పగించారు. మంచిర్యాలకు చెందిన సాయిసృజన్, స్వాతి దంపతుల నాలుగేళ్ల కుమారుడు సాయిసుశాంత్‌తో కలిసి రాఖీపౌర్ణమి రోజు పార్శిగుట్టలోని బంధువుల ఇంటికి వచ్చారు. సోమవారం ఇంటి నుంచి ఆడుకునేందుకు బయటకు వచ్చిన సాయి సుశాంత్ దారితప్పి న్యూ అశోక్‌నగర్‌లో ఏడ్చుకుంటూ స్థానికులకు కనిపించాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు బాలుడిని పోలీసులు చేరదీసి తల్లితండ్రుల వివరాలు కనుగొని అప్పగించారు.

ప్రొ.నవనీత రావు సేవలు మరువలేనివి

ఉస్మానియా యూనివర్సిటీ: దివంగత ఓయూ వీసీ ప్రొ.నవనీత రావు సేవలు మరువలేనివని పలువురు మాజీ వీసీలు పేర్కొన్నారు. సోమవారం క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన దివంగత మాజీ వీసీ ప్రొ.నవనీత రావు సంతాప సభలో వీసీ రవీందర్, మాజీ వీసీలు ప్రొ.రామచంద్రం, ప్రొ.సత్యనారాయణ, ప్రొ.సులేమాన్ సిద్దిఖీ పాల్గొని నివాళి అర్పించారు. ఓయూ భూముల పరిరక్షణ, ఉద్యోగాల భర్తీ, ఇతర అభివృద్ధి పనుల్లో ప్రొ.నవనీతరావు చేసిన కృషి ఎనలేనిదన్నారు.

కార్పొరేట్ స్థాయిలో సర్కారు బడులు

విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడి



అదనపు గదుల నిర్మాణ శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా చదువుకుంటున్న మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు ప్రకటించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో రూ. 1.84 కోట్ల వ్యయంతో నిర్మించే 16 తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన, నూతన తరగతి గదుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సోమవారం ఆమె పాల్గొని మాట్లాడారు. పేద వర్గాలు ఎక్కువగా చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలను సీఎం కేసీఆర్ ఆదేశాలతో మన బస్తీ–మన బడి కింద అనేక సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రాణిస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు వారంలో మూడు రోజులు విద్యార్థులకు అంబలి ఇస్తున్నట్లు చెప్పారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. మేకలమండి ప్రభుత్వ పాఠశాలలో పేద కుటుంబాలకు చెందిన 750 మంది చదువుకుంటున్నారని ఈ పాఠశాల అభివృద్ధితో పాటు సౌకర్యాలు, సదుపాయాలు కోసం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తున్నామన్నారు. విద్యాభివృద్ధి ద్వారానే పేదల జీవితాల్లో వెలుగు చూడగలమన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల సమగ్రాభివృద్ధికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణిదేవీ, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, విద్యాశాఖ కమిషనర్ దేవసేన, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డీఈఓ రోహిణి, డిప్యూటీ డీఈఓ చిరంజీవి, హెచ్‌ఎం మల్లికార్జున్‌రెడ్డి, కార్పొరేటర్ హేమలత, నాయకులు పవన్ కుమార్ గౌడ్, అత్తెల్లి అరుణగౌడ్, ఏసూరి మహేష్, వెంకటేషన్, వెంకటరమణ, శ్రీకాంత్‌రెడ్డి, ముక్కా శ్రీనివాస్, నాగలక్ష్మీ, శ్రీరాములు, వెంకట్ ముదిరాజ్ తపాల్గొన్నారు.

సనత్‌నగర్ అశోక్‌కాలనీలో..

సనత్‌నగర్: మనబస్తీ–మనబడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు కల్పించి కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. సనత్‌నగర్ అశోక్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో రూ.2.22 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల ఆవరణలో దాతల సహకారంతో ఏర్పాటుచేసిన మంచి నీటి ప్లాంట్, సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే అన్ని సౌకర్యాలు సమకూరుతాయని, నూతన ఫర్నీచర్‌ను కూడా అందజేస్తామని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతస్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలతో ప్రతిపక్షాల్లో భయం

డాక్టర్ లక్ష్మణ్



కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవం అనంతరం మాట్లాడుతున్న లక్ష్మణ్

సికింద్రాబాద్: జమిలి ఎన్నికల నిర్వహణ కోసం కేంద్రం కసరత్తు చేస్తుండగా ప్రతిపక్ష పార్టీల నేతలకు భయం పట్టుకుందని బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌లో ఏర్పాటు బీజేపీ నాయకురాలు ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జమిలి ఎన్నికల మీద విమర్శలు చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో పాటు దేశవ్యాప్త విపక్ష పార్టీల నాయకులు సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన వాఖ్యలను ఖండించకపోవడం శోచనీయమన్నారు. బీజేపీని విమర్శిస్తున్న పార్టీలు తమ పార్టీలో మహిళలకు సముచిత స్థానం కల్పించడంపై దృష్టి సారించాలన్నారు. మోదీ నేతృత్వంలో దేశవ్యాప్తంగా అన్ని వర్గాల మహిళలకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభం అనంతరం కుట్టు కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మెషిన్లు పంపిణీ చేశారు. టైలరింగ్‌లో ఉచిత శిక్షణలు ఇవ్వడంతోపాటు కంప్యూటర్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకురాలు మేకల కీర్తిని లక్ష్మణ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాం సుందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, నాయకులు రాచమల్ల కృష్ణమూర్తి, ఆదం విజయ్‌కుమార్, మద్దెర్ల శ్యాంసుందర్, కనకట్ల హరి, నాగేశ్వర్‌రెడ్డి, అనిత, అనూష, సరోజ పాల్గొన్నారు.

‘లాస్యనందిత విజయం ఖాయం’



లాస్య నందితను కలిసిన గౌరీశంకర్, శ్యామ్ కుమార్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందితకు పార్టీ వర్గాల నుంచి రోజురోజుకీ మద్దతు పెరుగుతోంది. బోర్డు మాజీ ఉపాధ్యక్షులు గౌరీశంకర్, బోర్డు మాజీ సభ్యుడు శ్యాంకుమార్ సోమవారం లాస్య నందితను కలిసి పార్టీ అభ్యర్థిగా ఎంపికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గౌరీ శంకర్ మాట్లాడుతూ.. దివంగత ఎమ్మెల్యే సాయన్న బాటలో లాస్యనందితకు కూడా ప్రజలందరూ అండగా నిలుస్తారని భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నివేదిత, పనస సంతోష్, భాస్కర్ ముదిరాజ్, సదానంద్ గౌడ్ పాల్గొన్నారు.

- డబుల్ ఇళ్లు పొందిన పలువురు లబ్ధిదారులు లాస్య నందితను కలిసిన తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న చొరవతోనే తమ సొంతింటి కల సాకారమైందని ఆయన సూచనల మేరకే తాము ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నామన్నారు. తొలివిడతలో కంటోన్మెంట్ పరిధిలోని 200 మందికి మాత్రమే ఇళ్లు దక్కాయని, త్వరలోనే మరో 400 మందికి ఇళ్లు దక్కుతాయని లాస్య తెలిపారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, గంజి శాంతి, జక్కూరు సీతమ్మ, గౌతమి, జానకి, సమ్మక్క, స్వాతి, ఏసుమణి ఉన్నారు.

భారతీయ భాషలకు సంస్కృతం తల్లిలాంటిది

ఆయాచితం నటేశ్వరరావు



ఆయాచితం నటేశ్వరశర్మను సన్మానించిన అధ్యాపకులు

సనత్‌నగర్: భారతీయ భాషలకు సంస్కృత భాష తల్లిలాంటిదని దాశరధి పురస్కార గ్రహీత, కామారెడ్డి పీవీపీ ఓరియంటల్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆయాచితం నటేశ్వరశర్మ అన్నారు. సంస్కృత భాషా వారోత్సవాల్లో భాగంగా కళాశాల సంస్కృత విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు సంస్కృత శ్లోకాలు, భగవద్గీత శ్లోకాల పఠనంతో పాటు సంస్కృత గీతాలాపన, నృత్యాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆయా అంశాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నటేశ్వరశర్మ మాట్లాడుతూ.. మన భాషలకు మూలం సంస్కృతమని, అలాంటి భాషా ప్రాధాన్యం మరింత పెరిగేలా విస్తృత కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యవక్తగా హాజరైన బహుభాషా కోవిదులు రమాదేవి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజానికి కాళీదాసు రచనల గురించి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ వసుధ, వెంకటేశ్వర్లు, నందిని, సూర్యనారాయణ, పద్మకుమారి, అప్సరు స్నేసా, గౌతమ్ పాల్గొన్నారు.

‘సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూబీ మనోహర్

సనత్‌నగర్: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని ఏఐసీసీ పర్యవేక్షకుడు, తమిళనాడు ఎమ్మెల్యే రూబీ మనోహర్ అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజాకోర్టు కార్యక్రమంలో రూబి మనోహర్ పాల్గొని మాట్లాడారు. కేసీఆర్, మోదీ రహస్య ఒప్పందంతో పని చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందిందని చెబుతున్నా ప్రభుత్వం దాని వల్ల పేద ప్రజలకు ఏం లాభం వస్తుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మోదీ హయాంలో ప్రజలను విభజించు, పాలించు పద్ధతిలో పాలన జరుగుతుందన్నారు. పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. సనత్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. కోట నీలిమా ఆధ్వర్యంలో ప్రజాకోర్టు నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, రాపోలు విజయ్‌కుమార్, ఎలీషా, బబ్లు, సల్మాన్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ పట్ల కేసీఆర్ వివక్ష



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కంటోన్మెంట్: ముఖ్యమంత్రిగా రాష్ట్రమంతటా ఒకే తరహా పాలన సాగించాల్సిన కేసీఆర్ కంటోన్మెంట్ పట్ల వివక్ష చూపుతున్నారని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐదోవార్డు సంజీవయ్య నగర్‌లో పర్యటించి మాట్లాడారు. కంటోన్మెంట్‌లో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయడం లేదన్నారు. తొమ్మిదేళ్లలో ఏ ఒక్క ప్రాజెక్టుకు నిధులివ్వకుండా, బీఆర్‌ఎస్ నేతలు కంటోన్మెంట్‌లో ఏ ముఖం పెట్టుకుని పర్యటిస్తారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నేతలను ప్రజలు అడుగడుగునా నిలదీయాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు.

ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించాలి



పద్మారావుగౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పద్మారావునగర్: ఎస్సీ వర్గీకరణ అంశాన్ని రానున్న పార్లమెంట్ సమావేశాల్లో బీఆర్‌ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయనను నాయకులు డప్పు మల్లికార్జున్ మాదిగ, ఇనుముల నరసయ్య, సామ్యూల్, యాదగిరి, సురేందర్, మహేష్, హాజీ, సుజాత కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణ విషయంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లే విషయంలో సీఎం కేసీఆర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని బీఆర్‌ఎస్ ఎంపీలు ప్రస్తావించేలా చొరవ చూపాలన్నారు.

దళిత బంధు, ‘డబుల్’ ఇళ్లలో మోచీలకు ప్రాధాన్యమివ్వాలి



అసదుద్దీన్ ఒవైసీకి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న దళిత బంధు, డబుల్ బెడ్‌రూమ్‌లలో మోచీలకు ప్రాధాన్యం ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని రవిదాస్ సమగర పరివార్ సంఘం రాంగోపాల్‌పేట్ డివిజన్ ప్రెసిడెంట్ అశోక్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి వినతిపత్రం ఇచ్చారు. ఎస్సీల్లో మోచీలు వెనుకబడి ఉన్నారని ప్రభుత్వ పథకాల్లో వీరికి ప్రాధాన్యం లభించడం లేదని ఎంపీకి వివరించారు. మోచీలకు కుల ధ్రువీకరణ పత్రాలు అందించడంలో తహసీల్దార్ కార్యాలయాల్లో జాప్యం చేస్తున్నారని ఈ విషయంపై దృష్టి సారించాలని వినతిలో పేర్కొన్నారు.

పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ నోటిఫికేషన్ పడకేసింది. గత నెల 17న కేటగిరి–1 పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడగా కేటగిరి–2 ప్రవేశాలకు 21న ప్రకటన విడుదల కానున్నట్లు ప్రకటించారు. కానీ ఇంత వరకు కేటగిరి–2 నోటిఫికేషన్‌ను విడుదల చేయలేదు. అధ్యాపకుల కొరతతో ప్రతి ఏటా పీహెచ్‌డీ ప్రవేశాల సంఖ్య తగ్గుతోంది. మాజీ వీసీ ప్రొ.తిరుపతిరావు హయాంలో నాలుగు వేల మంది విద్యార్థులకు పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించగా అధ్యాపకుల కొరత కారణంగా ప్రస్తుతం నాలుగు వందల మందికి మాత్రమే పీహెచ్‌డీ చదివే అవకాశం లభిస్తుంది. వెంటనే పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నేత రవినాయక్ డిమాండ్ చేశారు.



బోనాలతో తరలివస్తున్న భక్తులు

లాలాపేటలో బోనాలు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలో కొనసాగుతున్న బొడ్రాయి పునః ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా సోమవారం బోనాల జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం బలి కార్యక్రమం, పోతరాజుల వేషధారణ విన్యాసాలు, గావు కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో బోనాలతో తరలివచ్చి బొడ్రాయి వద్ద పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బోనాలతో లాలాపేటలో పండుగ వాతావరణం నెలకొంది.

స్థానికులకే టికెట్ కేటాయించాలి

లాలాపేట: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా స్థానికులకే అవకాశం కల్పించాలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం స్టేట్ వైస్ చైర్మన్ పరికి నర్సింగరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014 ఎన్నికల్లో జయసుధ కాంగ్రెస్ నుంచి పోటీ చేసి పదవి ముగిసాక పత్తా లేకుండా పోయారని 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 15 రోజుల ముందు కాంగ్రెస్ అభ్యర్థిగా వచ్చిన కాసాని జ్ఞానేశ్వర్ అడ్రస్ లేకుండా పోయారన్నారు. స్థానికేతరులకు అవకాశం ఇవ్వడం మూలంగా స్థానికంగా ఉన్న పార్టీ కేడర్ చెల్లాచెదురుగా సరైన నాయకత్వం లేకపోడంతో పార్టీ మరింత బలహీనంగా మారిందన్నారు. ఇప్పటికైనా స్థానికంగా ఉంటూ ప్రజలతో మమేకమైన నాయకుడికే టికెట్ కేటాయించాలని కోరారు.

ఓయూ ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్‌గా రఘుపతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్‌గా రఘుపతి నియమితులయ్యారు. ఓయూలో జర్నలిజం పూర్తి చేసి ఈటీవీ రిపోర్టర్‌గా పనిచేసిన రఘుపతి ఐదేళ్ల క్రితం ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా (బోధనేతర) ఈఎంఎంఆర్‌సీ ఉద్యోగంలో చేరారు. అనతి కాలంలోనే అధికారుల మన్ననలను పొందిన ఆయన ఇటీవల జరిగిన ఇంటర్వ్యూలో డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

ఔటా అభ్యంతరం

ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్ పదవీలో సీనియర్ ప్రొఫెసర్‌ను నియమించాలని ఔటా అధ్యక్షులు ప్రొ.మనోహర్‌కు వీసీ ప్రొ.రవిందర్‌కు లేఖ రాశా రు. ఓయూలో 40 ఏళ్లగా కొనసాగుతున్న ఈఎంఎంఆర్‌సీకి ఇంత వరకు యూజీసీ నిబంధనల ప్రకారం ప్రొఫెసర్ హోదా గల సీనియర్ అధ్యాపకులనే నియమించారని ప్రొ.మనోహర్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా పీహెచ్‌డీ, యూ జీసీ నెట్, టీచింగ్ అనుభవం గల అభ్యర్థులే ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్ పదవీకి అర్హులని నిబంధనలకు విరుద్దంగా రఘుపతిని నియమించారని ఇంటర్వ్యూకు హాజరైన ఇతర అభ్యర్థులు ఆరోపించారు.

గుర్తుతెలియని మృతదేహాలు స్వాధీనం

చిలకలగూడ: గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్న ఘటన సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ ఎస్‌ఐ జ్ఞానేశ్వర్ వివరాల ప్రకారం.. గాంధీ ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డు, మెడికల్ కాలేజీ మైదానం వద్ద ఈనెల 3వ తేదీన వేర్వేరుగా వ్యక్తులు అపస్మారకస్థితిలో పడిఉన్నట్లు గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది అత్యవసర విభాగానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఆర్.బసంతరాణి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు ఎంపికయ్యారు. సాయంత్రం సమయాల్లో పేద విద్యార్థులకు తరగతులు నిర్వహించడం, పలు సామాజిక సేవాకార్యక్రమాల్లో విశేషంగా పాల్గొన్న బసంతరాణి తన ప్రత్యేకతను చాటుకున్నారు. నైతిక శిక్షణ, దేశభక్తి, యోగా, సాంస్కృతిక సేవా కార్యక్రమాల్లో శిక్షణ ఇచ్చినందుకు గానూ ప్రభుత్వం ఈమెను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది

లాలాపేట: లాలాపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల(మార్కెట్ స్కూల్)లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న హైమావతికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కింది.

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీల ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపికైన బీఈడీ కాలేజీ సీనియర్ ప్రొ.మృణాళిని సోమవారం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఓయూ మోడల్ స్కూల్ డైరెక్టర్ ప్రొ.శంకర్, ప్రిన్సిపల్ ప్రొ.రఘునాథ్‌మూర్తి, అధ్యాపకులు మధుకర్, సునీత, సుజాత, లలిత, దుర్గేశం అభినందించారు.

నెలక్రితం గిన్నిస్ రికార్డు.. నేడు ఉత్తమ అధ్యాపకురాలి అవార్డు

ఉస్మానియా యూనివర్సిటీ: గత నెల 27న చెన్నైలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అవార్డు అందుకున్న డాక్టర్ జహీదా బేగం నేడు (5న) టీచర్స్ డే సందర్భంగా ఉత్తమ అధ్యాపకురాలి అవార్డు అందుకోనున్నారు. ఓయూ క్యాంపస్ లేడీస్ హాస్టల్‌లో ఉంటూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగంలో ఎంఏ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. విద్యార్థిగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఆమె అనేక ఇబ్బందులను ఎదుర్కొని కష్టపడి చదివి హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అధ్యాపకురాలిగా ఉద్యోగం సాధించారు. స్వయం కృషితో చిన్న వయస్సులోనే అవార్డులను అందుకోవడం సంతోషంగా ఉందని డాక్టర్ జహీదాబేగం పేర్కొన్నారు.

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బాలంరాయి, మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన మహిళా ఉపాధ్యాయులు ముగ్గురికి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు దక్కాయి. మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో పనిచేసే శ్రీలత, బాలంరాయిలో నల్లగుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు వడ్డేపల్లి రాజశైలజ, హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్)గా పనిచేస్తున్న ఉదయకుమారి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు.

సనత్‌నగర్: సనత్‌నగర్ ఎస్‌ఆర్‌టీ కాలనీలోని ప్రభుత్వ రౌండ్‌టేబుల్ పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న స్వర్ణకుమారి, బీకేగూడ ఉర్దూ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు రెహనాబేగం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. దేవనార్ అంధుల పాఠశాలలో స్వచ్ఛందంగా భౌతికశాస్త్రం, గణితశాస్త్రం బోధిస్తున్న పరమేశ్వరన్ రామస్వామికి ప్రైవేటు సెక్టార్ కింద ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది.

అడ్డగుట్ట: తుకారాంగేట్ ప్రైమరీ స్కూల్ హెచ్.ఎం. రాజనిర్మల కుమారికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది.

సనత్‌నగర్: నేషనల్ సుశ్రుత అసోసియేషన్ ఇండియా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు డాక్టర్ సూర్యపల్లి సారంగపాణికి దక్కింది. ఆయుర్వేద శల్యతంత్ర (సర్జరీ) చికిత్సలలో పేరెన్నికగన్న సారంగపాణికి ఉపాధ్యాయ అవార్డును అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు. సారంగపాణి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసి పదవీ విరమణ పొందారు. వైద్య సేవలను గుర్తించిన అనేక సంస్థలు ‘ధన్వంతరీ’, వైద్యశ్రీ పురస్కారాలతో సత్కరించాయి. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్టేట్ కౌన్సిల్ ఫర్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ కమిటీలో ఆయుర్వేద సభ్యుడిగా ఉన్నారు.



బసంతరాణి | ప్రొ.మృణాళిని | హైమావతి | స్వర్ణకుమారి | రెహనాబేగం | పరమేశ్వరన్ రామస్వామి | శ్రీలత | రాజ శైలజ | ఉదయకుమారి | రాజనిర్మల కుమారి | జహీదాబేగం | సారంగపాణి